# యక్షప్రశ్నలు




నిశాపతి

ధర్మరాజు ఒక స్థానిక నాయకుడు. అతనిచేతి కింద ఎప్పుడూ వందమందికి తగ్గకుండా 'కార్యకర్తలు' వుంటారు.

'ఫిట్‌నెస్' కోసం సైనికులు రోజూ కవాతు చేసినట్లు, అతని కార్యకర్తలు రోజూ ఏదో ఒక నినాదం దొరకబుచ్చుకుని వీధుల్లో ఊరేగింపుగా తిరుగుతుంటారు.

ఓ రోజు ధర్మరాజు కార్యకర్తల్లో నలుగురు అలాగే నినాదాలు చేస్తూ నెక్లెస్‌రోడ్డుకి వచ్చాక దాహం వేసి గొంతెండి పోయింది. అక్కడ ఏవీ దుకాణాలు కనబడలేదు. దాహానికి ఆగలేక ఒకే ఒక గుక్కెడు హుస్సేన్ సాగర్ నీళ్ళు తాగారు. అంతే ! వెంటనే నలుగురూ స్పృహతప్పి పడిపోయి నిర్జీవమైపోయారు.

వాళ్లని వెదుక్కుంటూ ధర్మరాజు వచ్చాడు. నలుగురూ అలా శవాల్లా పడి వుండడం చూసి దుఃఖిస్తుంటే హఠాత్తుగా హుస్సేన్‌సాగర్‌లోంచి లేచి వచ్చి ఓ యక్షుడు ప్రత్యక్షమైనాడు.

"ఇది నీ పనేనా?" అని ప్రశ్నిం చాడు ధర్మరాజు.

"అవును. నా అనుజ్ఞ లేనిదే ఈ హ్రదము నందలి జలములు ఎవ్వరును త్రాగరాదు" అన్నాడు యక్షుడు.

"ఏం? ఎందుకనట?" అడిగాడు ధర్మరాజు.

"నా నీటిని సీసాల్లో పట్టి 'మిన రల్ వాటర్' అను పేర నా అనుచరులు అమ్మెదరు. ఇట్లు అందరు ఉచితముగా త్రాగినచో వారి వ్యాపారమునకు నష్టము వచ్చును" అన్నాడు యక్షుడు.

"నీకు నష్టం వస్తుందని మను షుల్ని చంపేసెయ్యడమేనా?" అన్నాడు ధర్మరాజు కోపంగా.

"శాంతింపుము ధర్మజా! నీవు నా ప్రశ్నలకు సరియగు ఉత్తరము లిచ్చినచో వారిని మరల బ్రతికింతును. చింతిం పకుము" అన్నాడు యక్షుడు.

"మళ్ళీ యిదో ఫిటింగా? సరే కానీ, అడుక్కో" అన్నాడు ధర్మరాజు.

"ఏమంటివి?" అన్నాడు యక్షుడు కళ్ళెర్రజేసి

"కోప్పడకు యక్షా!"

"యక్షా ఏవిటి రిక్షా లాగా?"

"రిక్షా అంటే అంత చులకనా? అవునులే, నీది దేవతల బ్యాంకుకి సెక్యూరిటీ గూర్ఖాజాతి గదా? నీ బూర్జువా బుద్ధులెక్కడికి పోతాయ్, సరే, నీ ప్రశ్న లేవో మొదలుపెట్టు యక్ష రాజేంద్రా" అన్నాడు ధర్మరాజు వెటకారంగా.

"సరే, జాగ్రత్తగా విని సమాధానాలు చెప్పు. కళ్లు తెరుచుకుని గూడా నిద్రపోవునది ఏది? అని అడిగాడు యక్షుడు.

"ప్రభుత్వం" అని సమాధాన మిచ్చాడు ధర్మరాజు.

"నోరు తెరవనిదే ఊపిరాడనిది?"

"ప్రతిపక్షం"

"మనిషి మరణించిన వెనుక ఈ ప్రపంచమున మిగులునది ఏది?"

"సానుభూతి వోటు"

"ఆకాశం కంటె పెద్దది?"

"అధిష్ఠానం"

"భూమి కన్నా విశాలమైనది?"

"రియల్ ఎస్టేట్"

"వేగం వలన బ్రతికేది ఏది?"

"తెలుగు సినిమా సంగీతం"


"పుట్టి గూడా ప్రాణం లేనిది?" అడి గాడు యక్షుడు

"ఎమర్జెన్సీలో అసెంబ్లీ" అన్నాడు ధర్మరాజు.

యక్షుడిదగ్గర తాళపత్రగ్రంథాల్లో కొన్ని ప్రశ్నలు వాటి జవాబులూ వున్నాయ్. కానీ ధర్మరాజు చెప్పే సమాధానాలు ఏవీ వాటితో సరిపోవడం లేదు.

యక్షుడికి ఒకఆలోచన వచ్చింది. కాసేపు ఈ ప్రశ్నలు ఆపి తను బృహ స్పతుల వారివద్ద అభ్యసించిన విజ్ఞానం నుండి కొన్ని ప్రశ్నలు వేస్తే ఎలా వుంటుంది?!

'ప్రయత్నిద్దాం' అనుకున్నాడు యక్షుడు.




"ధర్మజా ! ఆశ్రయము లేక శోభిం పనిది ఏది?" అని ప్రారంభించాడు యక్షుడు.

"హంగ్ అసెంబ్లీలో మెజారిటీ పార్టీ" అన్నాడు ధర్మరాజు.

"బొందితో కైలాసము అనగా నేమి?"

"సంకీర్ణంలో ఏకాభిప్రాయం"

"సత్యము వంటి మిధ్యలు రెండు పేర్కొనుము"

"ప్రజలే ప్రభువులు; చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అన్నాడు ధర్మరాజు.

"ఎవడు నమ్మరాని వాడు?"

"సెల్‌ఫోన్ మాత్రమే వుండి, ల్యాండ్‌లైన్ లేని వాడు"

"నిర్భయముగా తన భావమును ప్రకటించు వానిని ఏమందురు?"

"ఇండిపెండెంట్ ఎమ్మెల్యే! అతనికి 'విప్' వుండదు.

"మానవుని జయాప జయములకు కర్త ఎవరు?"

"మనిషి పుర్రె"

"శైవ వైష్ణవములకు సమన్వ యము కుదుర్చుటెట్లు?"

"రెండో ఎస్సార్సీ ద్వారా"

"తల్లులకు తమ బిడ్డలపై ఎంతవరకు నియంత్రణ వుండవలెను?" అన్నాడు యక్షుడు.

"మొదటిస్నానంపై మాత్రం కంట్రోలు వుండాలి" అన్నాడు ధర్మరాజు.

యక్షుడికి మతిపోయింది. ఈ ప్రశ్నలకి కూడా ధర్మరాజు తనకి యిచ్చిన సమాధానాలకి బృహస్పతుల వారి వద్ద తను నేర్చుకున్న దానికీ ఎక్కడా పొంతన కుదరడం లేదు. పోనీ, ఏదో దబాయిద్దాం అంటే, ఈ ధర్మ రాజు చాలా పలుకుబడి గల వ్యక్తి. అతనికి కృష్ణమూర్తి అండ వుంది.

అందుకని ఈసారి యక్షుడు మరో కొత్త ఉపాయం ఆలోచించాడు. తను ముందుగా భూలోకవిషయాలు, ముఖ్యంగా ఆంధ్రదేశ విషయాలు అన్నీ

దివ్యదృష్టితో గ్రహిస్తాడు. తరువాత 'వాని నన్నియు సంగ్రహించి, పృచ్ఛించి వీనిని నిర్జింప వచ్చును' అనుకున్నాడు.

అనుకున్నదే తడవుగా దివ్యదృష్టి సారించాడు. ఆంధ్రదేశంలో రాజకీయాలు, క్రికెట్టూ, సినిమా, టీవీ వగైరా లన్నీ కళ్ళముందు కట్టాయి.

విజయగర్వముతో ధర్మరాజు వైపు తిరిగి,

"ధర్మజా ! నీ సమాధానము లన్నియు తలతిక్కగా నున్నవి అయినను నీకు మరియొక అవకాశమిచ్చెదను" అన్నాడు.

"సరే, అడుగు" అన్నాడు ధర్మరాజు.

"ధర్మజా! మీ పాలకులు ఏ పక్షము వారైనను పేదలకు ఇండ్లు, భూములు యిచ్చి మేలు చేయుచున్నారు గదా! మరి ఎన్నికలవేళ డబ్బును,మద్య మును పంచవలసిన ఆవశ్యకత ఎందు లకు వచ్చినది?"అని అడిగాడు యక్షుడు.

ధర్మరాజు నవ్వాడు.

"మంచిప్రశ్న. సమాధానం విను. ఇండ్లు, భూములూ యిచ్చేది వాళ్ల ఓట్లు వాళ్లు వేయడానికి. డబ్బు, మద్యం యితర్ల వోట్లు వాళ్లు వేయడానికి" వివరించాడు ధర్మరాజు.

"ఇతరుల ఓటులు వారెట్లు వేయ గలరు?" సంశయం వెలిబుచ్చాడు యక్షుడు.

"అది నీకు అర్థం కాదులే! అయినా అను బంధ ప్రశ్నలు అడ క్కూడదు. నో సప్లి మెంటరీస్ ప్లీజ్" అన్నాడు ధర్మ రాజు.

"నేనును 'ప్లీజ్'. ఇది యొక్క టియు చెప్పవా?" అన్నాడు యక్షుడు

"సరే,అయితే విను ! ఇతరుల వోట్లంటే మేధావుల వోట్లు. వారు రాత్రంతా కూర్చుని, ప్రజాస్వామ్యం ఎలా అపహాస్యం పాలౌతుందో వ్యాసాలు రాసి, వోటు వేయవలసిన వేళల్లో అలసి నిద్ర పోతుంటారు. వాళ్ల వోట్లు మురిగి పోకుండా బీదప్రజల్తో వేయించి, ప్రజా స్వామ్యాన్ని నిలబెడతారు మా నాయకులు" అన్నాడు ధర్మరాజు.

"ఏమియో గందరగోళముగా నున్నది. పోనిమ్ము. మరియొక ప్రశ్న. ప్రజా ప్రభుత్వ మనగా ప్రజలచే ఎన్నుకో బడవలెనట గదా! మరి అట్లు గాక వారి వారి సంతానమునే వారి వారసులుగా ప్రకటించి, వారే ఎన్నికగులాగున ప్రవర్తించుట ధర్మవిరుద్ధము కాదా?"

"ఎంత మాత్రం కాదు. 'ప్రజా' అంటే సంతానం అని గూడా అర్థం వుంది.కాబట్టి ప్రజాస్వామ్యం అంటే తమ సంతానానికి పదవులు కట్టబెట్టడమే! ఈ డబుల్ మీనింగ్ టెక్నిక్ మీ దేవతలు కనిపెట్టిందే !"

"ఏమీ మాకే ఎసరు పెట్టు చుంటివా? కానిమ్ము. తరువాత చూసి కొందును. మరి యొక ప్రశ్న. లోకము నిన్ను సర్వజ్ఞుడనును. రేపు శాసనసభలో ఏ విషయముపై చర్చ జరుగునో తెలుపగలవా?" అని అడిగాడు యక్షుడు.

"సభా సమయాన్ని ఎవరు వృధా చేశారన్న విషయం మీద రేపు తీవ్రంగా చర్చ జరుగుతుంది" అన్నాడు ధర్మరాజు.

"ఏమీ వృధా గురించి చర్చిం చుట మరింత వృధా కాదా?"

"అదిగో, మళ్లీ సప్లిమెంటరీ..."

"వలదులెమ్ము! తదుపరి ప్రశ్న..."

"యక్ష రాజేంద్రా! నీకు మా పాలిటిక్స్ గొడవ లెందుకు? ఏవో నీ రొటీన్ ప్రశ్నలు నువ్వడక్కు" అని అడ్డు తగిలాడు ధర్మరాజు.

''అవ్వా! ఆశ! అట్లడిగినచో వాని కేవియో తింగర జవాబులిచ్చితప్పించు కొనవలెననియా? కుదరదు".

"సరే, నీకు తోచిందే అడుక్కో!"

''అదిగో, మరల తిరస్కారం"

"సారీ, సారీ..."

"సరి సరి! ఈ సారికి నీ సారీ సరుకు చేయుచుంటిమి. మరల నిటులాడిన సహింపను."

"అలాగే అడుగు."

మీ దూరదర్శన యంత్ర కార్యక్రమాల్లో మీరేల వినోదకార్యక్రమాలు ప్రసారం చేయడం? ఎల్లప్పుడు ఆస్తికై కుట్రలు, కుటుంబ హత్యలు, జైల్లో మహిళలు, ఏబది ఏండ్ల నాటి అత్తా కోడండ్ర తగువులు.... దక్క" అని అడిగాడు యక్షుడు.

"అన్యాయంగా నిందలేయకు. అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారం పేరిట మేం వినోదకార్యక్రమాలు ప్రసారం చేస్తూనే వున్నాం. అని జవాబిచ్చాడు ధర్మరాజు.

''నిరుద్యోగులకు ఏ విధముగా ఆశ్రయము కల్పించుచున్నారు?"

"మా నగరశివార్లలో పెద్ద అరుగు లంత 'ఫుట్‌పాత్'లు నిర్మిస్తున్నాం. అవన్నీ నిరుద్యోగులకి ఆశ్రయం యివ్వడానికే'' బదులిచ్చాడు ధర్మరాజు.

"ఫుట్‌పాత్'లనగానేమి? పాద చారులు నడుచు మార్గములా?"

"ఆర్నీ అమాయకత్వం సంతకెళ్లా! ఫుట్‌పాత్‌లంటే నీ భాషలో 'యథేచ్ఛా విపణి వేదిక'లు ! వాటిమీద మనుషులు నడిచేందుకు ఖాళీ వుండదు." వివరిం చాడు ధర్మరాజు.



శ్రీ త్యాగరాయ గానసభ హైదరాబాద్‌లో సమైక్య భారతి ఆధ్వర్యంలో జరిగిన సభలో డా॥ తిరుమల శ్రీనివాసాచార్య రచించిన "దాశరథి" గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డా॥సి. నారాయణరెడ్డి. చిత్రంలో పల్లేటి లక్ష్మీకులశేఖర్, కృతి స్వీకర్త కె.వి.రమణచార్య, గ్రంథకర్త శ్రీనివాసాచార్య, డా॥ రాళ్లబండి కవితా ప్రసాద్, డా॥ ఎల్లూరి శివారెడ్డి ఉన్నారు.

"క్రికెట్ మీ ఆంధ్రుల అభిమాన క్రీడ గదా ! మీ భారతీయ క్రికెట్ అగ్రశ్రేణి దండ వాహులకును (బ్యాట్స్‌మన్‌కి), ప్రభుత్వోద్యోగులకును సారూప్యమేమి?"

"ఇద్దరికీ పని కాకపోయినా మనీ దొరుకుతుంది"

"వారిలో కొందరు ఏదో రాజ కీయ పక్షము స్థాపింపమన్నారట. దానికి ఎన్నికల చిహ్నము లభించినదా?

"లేదు. బాతు (డక్) గుర్తుకై వారిలో వారు పోటీపడ్డంవల్ల ఆ విషయం పెండింగ్‌లో వుంది."

"మీ చలన చిత్ర నాయికలు ఏల 'అస్తినాస్తివిచికిత్సా హేతువు'లగు వస్త్రములు ధరింతురు?" అడిగాడు యక్షుడు.

"ఓ ! నువ్వడిగేది 'ఎక్స్‌పోజింగ్' గురించా! అందులో పాపం వాళ్ళ తప్పేం లేదు. నిర్మాణ వ్యయం పెరిగిపోవడం వల్ల హీరోయిన్ గానూ, వాంప్ గానూ టూఇన్‌వన్ గా పనిచేసి నిర్మాతల్ని ఆదు కోవాలని పాపం, వాళ్ళు ఒళ్లు దాచు కోకుండా కష్టపడుతున్నారు" విశదీక రించాడు ధర్మరాజు.

"ధర్మజా! నీ సమాధానము లన్నియు విడ్డూరముగా నున్నవి అయి నను నాకు నీపై కోపము వచ్చుటలేదు. పుత్రవాత్సల్యము వంటిదికలుగుచున్నది"

"యక్ష రాజేంద్రా ! నేను నిన్నొక ప్రశ్న అడుగవచ్చునా?" అర్థించాడు ధర్మరాజు.

"ప్రశ్నలు అడగాల్సింది నేనయ్యా బాబూ! సర్లే పోనీ అడుక్కో! జవాబు చెప్పి పెడతా! ఛీ ! ఛీ ! ఇది యేమి నీ భాష నాకు సంక్రమించినది? ఏమి అడిగెదవో అడుగుము" అన్నాడు యక్షుడు.

"నీవు ధర్మజ్ఞుడవు. దేవయానివి! నీ నీటిని తాగారన్న చిన్న కారణంతో ఏకంగా మనుషుల్ని చంపెయ్యడం న్యాయమేనా?"

"ధర్మజా! అది నా దోషము కాదు నాయనా! ఆ నీటియందు సంగమించిన దుష్ట ధాతువుల ప్రభావం. అయినను మీ వారిలో ఎవరినో ఒకరిని బ్రతికింతు నంటినిగదా! నీకింక దిగులేల?"

"అదుగో, మాట మారుస్తున్నావ్. ఇందాక అందర్నీ బతికిస్తానన్నావ్? ఇప్పుడు ఎవరో ఒకర్ని అంటున్నావ్ వీల్లేదు. అందర్నీ బతికించాల్సిందే అని నేను డిమాండ్ చేస్తా వుండా" అన్నాడు ధర్మరాజు.

"అట్లంటివా? లెక్క పొరపాటు. ఈ మధ్య నా కొలనులో విసరివేయు వార్తా పత్రికలు చదివి ఇట్లు పొరబడుచుంటిని.. ఏమియూ అనుకొనకుము. ఒక్కనిని మాత్రము కోరుకొని సర్దుకొని పొమ్ము" అని బ్రతిమాలాడు యక్షుడు.

"సరే, అలా అయితే, అందరి కంటె చిన్నవాడు, వాడే, వానిని బతికింపుము" రాజీ కొచ్చాడు ధర్మరాజు.

"అటులనే" అని యక్షుడు ఏదో మంత్రం చదువుతూ గాల్లోకి చెయ్యి జాపాడు. ఓ కలశం చేతిలోకి వచ్చింది. దానివైపు చూడగానే అది గాలిలో తేలుకుంటూ హుసేన్ సాగర్‌నీళ్లకేసి పోతోంది.

"ఆగు!" అన్నాడు ధర్మరాజు దాన్ని ఉద్దేశించి.

అది ఆగింది. సినిమాల్లో పెళ్ళికొడుకు మంగళసూత్రం కట్టబోతూ ఆగినట్లు.

ధర్మరాజు యక్షుడికేసి తిరిగి "మళ్లీ యీ ఛండాలపునీళ్ళతోనే మంత్రం వేస్తావా? అది పారుతుందో లేదో?!" అన్నాడు.

యక్షుడు కొంచెం తటపటా యించి, "అయినచో శుద్ధ జలమును తెప్పింపుము" అన్నాడు.

"ఏంటి మంచినీళ్లా? మళ్ళీ శనివారం దాకా రావు. ఇవాళ ఆదివారం"

"ఏ తల్లినైనను అడిగి ఒక కలశంబు నీరు తెమ్ము"

"ఈ చెంబెడా? ఇంత పెద్ద చెంబు పట్టుకెళ్తే చెప్పుచ్చుకుంటుంది"

"ఇది చెంబు కాదు కలశంబు."

"అదేలే ఏదైనా శెంబే కదా ! మంచి నీళ్లు మాత్రం అడక్కు. కావాలంటే కావలసినంత గుడుంబా తెప్పిస్తా"అన్నాడు ధర్మరాజు.

యక్షుడు ఏదో అనబోతూండగా, "అదేదో కాస్త తొందరగా తెప్పించన్నా" అని సన్నని గొంతు వినబడింది.

"విచిత్రం! విచిత్రం! ఈతడెట్లు బ్రతికినాడు?" కంగారుపడ్డాడు యక్షుడు.

"వాడికి మందే మంత్రం. చచ్చి నోడు లేచికూచుంటాడు. సరే, థాంక్స్‌య్, యక్షా. వెళ్లొస్తాం" అన్నాడు ధర్మరాజు.

"గౌరవము, గౌరవము" అన్నాడు యక్షుడు.

"మా పనైపొయ్యాక యింకా నీకు గౌరవమేంటి? 'పోబే' అన్లా సంతోషించు" అంటూ అనుచరుడి చెయ్యి పట్టుకుని నడుచుకుంటూ వెళ్ళిపోయాడు ధర్మరాజు గుడుంబా తెచ్చి అనుచరులందర్నీ బతికించుదామని.

## విజ్ఞప్తి

చినుకు మాసపత్రిక జూలై సంచిక నుండి సంగీత నృత్య సాంస్కృతిక రంగాలకు చెందిన యువ ప్రతిభామూర్తులను, వివిధ ప్రాంతాలలో జరిగిన కార్యక్రమాలను, ఆయా రంగాలలో వారందుకుంటున్న పురస్కారాలను పాఠకులకు పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో కళాకౌముది అనే శీర్షికను ప్రారంభించింది.

ఈ శీర్షికకు మీ ప్రాంతాలలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల వివరాలు, మిమ్మల్ని అబ్బురపరిచే కళాకారుల ప్రతిభా పాటవాలను చినుకు పాఠకులకు పరిచయం చేయండి. వారి ఫోటోను వివరాలతో జతకలిపి పంపించండి.

సాహిత్య సాంస్కృతిక వారసత్వాన్ని ముందుతరాలకు అందించే బాధ్యతకు ఆలంబనగా నిలుస్తున్న చినుకు పత్రికను ఆదరించండి.